క్లుప్తంగా

లడ్డూ @ రూ.4.5 లక్షలు


గణపతికి నివేదించిన 50 కిలోల లడ్డూ

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ సమీపంలో గల ఆక్సిజన్ టవర్స్ అపార్ట్‌మెంట్ ఆవరణలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వినాయకుని ప్రసాదమైన 50 కిలోల లడ్డూ వేలం పాటలో భక్తులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. చివరికి లడ్డూని అపార్ట్‌మెంట్‌కి చెందిన హర్ష రూ.4.50 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆక్సిజన్ టవర్స్ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని చినవాల్తేరు ప్రాంతానికి చెందిన సాయిదీలీప్‌శర్మ రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దాతకు బాండ్‌ని ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కి చెందిన సునీల్ మేఘవాల్ (23) ఒడిశాలో గంజాయి కొనుగోలు చేశాడు. ఆ సరకుతో మంగళవారం రామాటాకీస్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడే ఉన్న ద్వారకా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో సదరు నిందితుడు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసినట్లు అంగీకరించాడు. ద్వారకా స్టేషన్ సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

49 మంది డ్రైవింగ్ లైసెన్సుల రద్దు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ద్వారకా పోలీసులు రోజూ స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలలో తీసుకొచ్చిన మార్పులు ఈ నెల ఒకటి నుంచి అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. మంగళవారం స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 49 మం డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 400 మంది వాహన చోదకుల డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశామని తెలిపారు.


కొత్తపాలెం ప్రధాన రహదారిలో కార్పొరేటర్ ఇల్లు


బహుళ అంతస్తులతో కొత్తపాలెం ప్రాంతం

80 తూచ్.. 60 అడుగులే!

- కొత్తపాలెం రహదారి విస్తరణలో దోబూచులాట
- 80 అడుగుల మేర విస్తరించాలని మాస్టర్‌ప్లాన్
- ఆ రోడ్డులో కార్పొరేటర్ ఇల్లు ఉండడంతో కుదించడానికి సిద్ధం
- ప్రజాభిప్రాయం పేరుతో తగ్గించడానికి ఎత్తుగడ

ఆ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. బహుళ అంతస్తులు.. వాణిజ్య సముదాయాలతో కళకళలాడుతోంది. అందుకు తగ్గట్టుగా రోడ్డు సదుపాయం లేకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ నేపథ్యంలో ఆ రహదారిని విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. 80 అడుగుల మేర విస్తరించాలని మాస్టర్ ప్లాన్ రూపొందించారు. దాని ప్రకారం రోడ్డు వేస్తే కార్పొరేటర్ ఇల్లు 20 అడుగుల మేర పోతుంది. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయం పేరుతో 60 అడుగులకు కుదించాలనే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రధాన రహదారి విస్తరణ జాప్యమవుతోంది. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల మేర విస్తరించాలని పొందుపరిచారు. అయితే టీడీపీ నాయకుల ఒత్తిడితో 60 అడుగులకు కుదించడానికి పావులు కదుపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

రహదారి విస్తరణకు సంబంధించి జీవీఎంసీ అధికారులు ఇటీవల సర్వే కూడా చేపట్టారు. ప్రస్తుతం ఈ రహదారి 40 అడుగులు ఉంది. ఇది 80 అడుగులు విస్తరిస్తే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు తొలగించాల్సి వస్తుంది. ఈ దారిలో స్థానిక కార్పొరేటర్ ఇంటితో పాటు ఎమ్మెల్యే అనుచరుల దుకాణాలు ఉన్నాయి. కార్పొరేటర్ ఇల్లు సుమారు 20 అడుగులు పోయే అవకాశం ఉంది. 60 అడుగుల మేర విస్తరించినా కొంత తెగుతుంది. అయితే దాన్ని ఎలాగోలా మేనేజ్ చేయవచ్చునని కార్పొరేటర్ ధీమా అట. దీంతో ఎమ్మెల్యే ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి 60 అడుగులకు కుదించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రజాభిప్రాయం అనే ముసుగు తొడగడానికి కూడా సిద్ధం అయినట్టు తెలుస్తోంది.


ఇళ్లు, దుకాణాల ఆక్రమణతో ఇరుగ్గా 40 అడుగుల రోడ్డు

రహదారికి పెరిగిన ప్రాధాన్యం

40 అడుగుల రహదారి ఉదయం, సాయంత్రం సమయాల్లో రద్దీగా ఉంటోంది. అండర్‌పాస్‌వే కూడా అందుబాటులోకి రావడంతో ఈ రోడ్డులో వాహనాల తాకిడి మరింత పెరిగింది. బాజీ జంక్షన్ నుంచి నరవ వెళ్లే వరకు వాహనాల సంఖ్య రెట్టింపు అయింది.ఇటీవల ఆర్టీసీ బస్సు కూడా రాకపోకలు సాగిస్తోంది. దీంతో కీలక సమయంలో ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు, ప్రజలు వాపోతున్నారు.

అభివృద్ధి చెందుతున్న ప్రాంతం

కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు, గ్రూప్‌హౌస్‌ల నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయి. కార్లు వంటి వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో భారీవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యకు రహదారి విస్తరణే పరిష్కారమని చెబుతున్నారు.

భవిష్యత్తు అవసరాలు కీలకం

చంద్రనగర్ నుంచి నరవ వెళ్లే రహదారి విస్తరణ పనులు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కొంత మందికి మేలు చేకూర్చే విధంగా కుదించే ప్రయత్నాలు చేయవద్దని ప్రాధేయ పడుతున్నారు.

సర్వే చేస్తున్నాం..

రహదారి విస్తరణకు సర్వే జరుపుతున్నాం. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రహదారి ఉంది. ఇది 60 అడుగుల రహదారి చేయాలా.. 80 అడుగుల రహదారిగా ఉంచాలా అన్నది ఇంకా నిర్ణయించలేదు. దీనిపై పబ్లిక్ నోటిఫికేషన్ ఇస్తాం. ప్రజల అభిప్రాయాలు తీసుకుని నిర్ణయించాల్సి ఉంది.

– రఘునాథరావు, ఏసీపీ జోన్–8

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై స్పందించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘ కార్యదర్శి హుస్సేన్

మల్కాపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగులు సమావేశమై సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ కోసం పోరాటం చేస్తుంటే కేంద్రం అడ్డు తగులుతూ తమ ఉద్యమాన్ని అణచివేయాలని యత్నిస్తుందని ఆరోపించారు.దేశవ్యాప్తంగా సుమారు 77 లక్షల మంది పెన్షన్ దారులు ఉంటే హయ్యర్ పెన్షన్ కోసం దాదాపు 17 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. వీరిలో కేవలం 8 వేల మందికి మాత్రం హయ్యర్ పెన్షన్ కేంద్రం అమలు చేస్తుందని,మిగిలిన వారికి మొండి చెయ్యి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం తమ సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన విరమించాలి


హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న అఖిల పక్ష యూనియన్ నాయకులు



గోపాలపట్నంలో నిరసన తెలియజేస్తున్న సీటూ నాయకులు

మల్కాపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు కేంద్రం ప్రభుత్వం యత్నిస్తుందని, తక్షణం ఆ ప్రయత్నం ఆపకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని అఖిల పక్ష యూనియన్ నాయకులు హెచ్చరించారు.స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) లేబర్ గేటు వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ బీజేపీ ఆలోచనల వల్ల దేశంలో అనేక ప్రభుత్వ రంగ పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. బీజేపీ ఎప్పుడు కేంద్రంలో అధికారం చేపట్టినా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీ కరణ చేయాలనే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. వారి ఆలోచన వల్ల లక్షలాది మంది కార్మికులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటారావు,నర్సింగ్‌యాదవ్,తాతబాబు,నరేష్,గంగాధర్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలనే డిమాండ్‌తో సీఐటీయూ గోపాలపట్నం జోన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం ప్రధాన రహదారిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జోన్ ప్రధాన కార్యదర్శి ముద్దాడ వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు శాశ్వత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గనులు కేటాయించకుండా ఉత్పత్తిని తగ్గించి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకు వచ్చారని విమర్శించారు. కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మోదీపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీటూ నాయకులు శేషగిరి, శ్రీనివాసరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాత భవనం


వెంకన్నపాలెం మార్గంలో పాత భవనం ఇదే

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపాన వెంకన్నపాలెం వద్ద ఓ పాత భవనం ఆ ప్రాంత వాసులను భయం దోళనకు గురి చేస్తోంది. దీని పక్క నుంచి నడిచేందుకు ఆ ప్రాంత వాసులు ధైర్యం చేయలేక పోతున్నారు. వెంకన్నపాలెం కృష్ణుడి ఆలయానికి వెళ్లే మార్గం వద్ద పాత భవనం ఉంది. ఇంట్లో మూడేళ్ల నుంచి ఎవరూ నివాసం ఉండడం లేదని స్థానిక వాసులు తెలుపుతున్నారు. భవనం చుట్టూ చెట్లు మొలిసి,వ్యర్థాలతో నిండి ఉంది.అలాగే ఈ భవనం గోడలు బీటలు వారి,పెచ్చులు ఊడి ఉన్నాయి. దీంతో ఈ భవనం పక్క నుంచి నడిచేందుకు స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్దేశిత సెలవులు పాటించాలి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారామ్


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గొండు సీతారామ్

గాజువాక: విద్యార్థుల మనోవికాసానికి ప్రతినెలా రెండో శనివారం, ప్రతి ఆదివారంతో పాటు నిర్దేశిత పండగలు, సెలవు దినాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల పాత్ర అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయన్నారు. వీటిపై తమకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయన్నారు. సెలవులు పాటించడంలో యాజమాన్యాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని, తద్వారా విద్యార్థులు మానసిక ఆనందానికి దూరంగా ఉండటాన్ని తమ కమిషన్ సీరియస్‌గా పరిగణిస్తోందన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో లైంగిక దాడుల నిర్మూలన, మంచి, చెడు స్పర్శలపై అవగాహన, ఆడపిల్లల రుతుస్రావం సమయంలో ఒత్తిడిలేని విద్యను అందించే ఆరోగ్య సూత్రాల అమలు, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదన్న నెపాన్ని పిల్లలపై నెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఎంబసీ ఫౌండర్ ఉమారాజ్, సైకాలజిస్ట్ ఎం.వంశీ, క్లినికల్ సైకాలజిస్ట్ పార్వతి కస్యప్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఖలీషా బేగం, గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు బి.విశ్వనాథ్, సునీత, రమణాజీ, ఇ.శ్రీనివాస్, జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాస్, గాజువాక చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ నీలవేణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ పాల్గొన్నారు.

ప్రమాదమా.. తప్పిదమా!

- కొండవాలు ప్రమాదంపై చర్చ


గోపాలపట్నం ప్రధాన రహదారిలో కొండవాలు ప్రాంతానికి ఆనుకుని ఉన్న భవనాలు


కొండచరియలు విరిగి పడిన ప్రాంతం ఇదే

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో కొండచరియలు విరిగి పడిన ఘటనపై భిన్న చర్చలు నడుస్తున్నాయి. ఇది ప్రమాదమా... తప్పిదమా అని ప్రశ్నిస్తున్నారు. గోపాలపట్నం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కొన్ని వ్యాపార భవనాలు కొండను తొలిచి నిర్మాణాలు చేపట్టారు. అలాగే మరి కొందరు ఇటీవల కొండను తొలిచి నిర్మాణానికి సిద్ధం చేస్తున్నారు. దీని వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడి భవన యజమానులకు డాక్యుమెంట్లలో ఉన్న స్థలం కంటే నిర్మాణ స్థలం ఎక్కువగా ఉంటుందని.. కొండను ఆక్రమించడం వల్లే వచ్చిందని బాహాటంగానే చెబుతున్నారు. వీరి ఆక్రమణలకు రాజకీయ అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. కాని పాక్షికంగా మట్టి జారకుండా చర్యలు చేపట్టి వదిలేశారు. పెద్ద వర్షాలు పడితే ఈ ప్రాంతంలో పెను ప్రమాదమే చోటు చేసుకుంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొండ వాలు ప్రాంతాన్ని ఆక్రమించి వాణిజ్య భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కి చెందిన 11 సంవత్సరాల బాలిక ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అడ్డుకుని చెయ్యి పట్టుకుని బలవంతంగా బైకు పైకి ఎక్కించడానికి ప్రయత్నించాడు. దీంతో భయపడిన బాలిక అతని బారి నుంచి తప్పించుకుని ఇంటికెళ్లి తల్లిదండ్రులకు విషయం వివరించింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోక్సో చట్టం సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో మహిళా ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయనగరం జిల్లా జామికి చెందిన ఎర్రినాయుడు(45)గా గుర్తించారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

- పోరాడి, సాధించాలి
- కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు


సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం: సమస్యలకు ఆత్మహత్యే పరిష్కారం కాదని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. జీవితం ఎంతో విలువైందని, దానిని చేజార్చుకోవద్దని సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినాన్ని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితం ఓ ప్రయాణమని, ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతాయని అన్నారు. ధైర్యంగా నిలబడి వాటిని ఎదుర్కోవాలే గానీ, తొందరపాటుతో ముగించవద్దని హితవు పలికారు. సైక్రియాటిస్ట్ బి.నిత్య ఐశ్వర్య మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని బద్దలు చేయాలన్నారు. ఈ రోజుల్లో ప్రతి 20 సెకండ్లకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని, అందులో ఎక్కువ శాతం యువత ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణకై సమాజంలో మార్పు తీసుకురావాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. మానసిక ఇబ్బంది ఉన్న వారు గవర్నమెంట్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1 4 4 16 ద్వారా మానసిక వైద్యుల సలహాలు, కౌన్సెలింగ్ పొందవచ్చని జాతీయ సేవా పథకం అధికారి పోలా ఉమామహేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి, జి.వి.ప్రతాప్ పాల్గొన్నారు.

కోలుకున్న మానసిక రోగి ఏయూటీడీ షెల్టర్‌కు అప్పగింత


జితేంద్ర సాహును షెల్టర్ ప్రతినిధులకు అప్పగిస్తున్న డాక్టర్ రాజేష్ తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ మెంటల్ కేర్ హాస్పిటల్‌లో కొన్ని నెలలుగా చికిత్స పొందుతున్న మానసిక రోగి పూర్తి స్థాయిలో కోలుకున్నట్లు డాక్టర్ రాజేష్ వెల్లడించారు. గత ఫిబ్రవరిలో విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మానసిక స్థితి బాగోలేని జితేంద్ర సాహు అనే వ్యక్తిని ఏయూటీడీ షెల్టర్ మేనేజర్ భాస్కరరావు గుర్తించి షెల్టర్‌కు తరలించారు. అనంతరం షెల్టర్ కార్యదర్శి ప్రగడ వాసు సూచన మేరకు చికిత్స నిమిత్తం మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్చారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స అందించడంతో జితేంద్ర సాహు కోలుకున్నాడు. అతడిని డాక్టర్ రాజేష్ ఏయూటీడీ షెల్టర్ ప్రతినిధులకు తిరిగి అప్పగించారు. అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని షెల్టర్ ప్రతినిధులు పేర్కొన్నారు.

స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్ ఆపాలి

మహారాణిపేట: రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో పని చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు నర్సుల గడచిన ఐదు రోజులుగా నిరసన తెలియజేస్తున్నారు. మంగళవారం కేజీహెచ్ క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సుల స్ట్రగుల్ కమిటీ స్టేట్ కో–ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 11న ఏఎన్‌ఎంలకు స్టాఫ్ నర్సులగా పోస్టింగ్ ఇస్తూ నిర్వహించే కౌన్సెలింగ్‌ను నిలిపేయాలన్నారు. లేని పక్షంలో తమ నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నర్సింగ్ విద్యలో మూడు సంవత్సరాల డిగ్రీ చేసిన వారు, పీజీ చేసిన వారు కోవిడ్‌కు ముందు నుంచి కూడా తమ అమూల్యమైన సేవలు అందిస్తున్నారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.శాంతికుమారి, కె.సూర్యకళ, వి.వినీల, ఎస్.వరలక్ష్మి, ఎస్.శోభారాణి, వి. శేఖర్, సత్యనారాయణ, పోరాట కమిటీ సభ్యులు, హెడ్‌సిస్టర్లు, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

యూడైస్‌లో వివరాలు నమోదు చేయకుంటే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు యూడైస్‌లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చినగదిలి, సీతమ్మధార మండలాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లతో మంగళవారం విశాఖ వేలీ స్కూల్‌లో యూడైస్ – 2024 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూడైస్‌లో పాఠశాలలు, వాటిలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను సక్రమంగా, సకాలంలో నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసిన అనంతరం ఎలాంటి తప్పులు ఉన్నా ఇచ్చిన గడువులోగా మళ్లీ సరి చేసుకోవాలని తెలిపారు. లేదంటే అప్‌లోడు చేసిన తర్వాత సరిదిద్దుకోవడానికి అవకాశం ఉండదన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి చెందినదని, అందుకే అప్‌లోడు చేసిన అనంతరం సరిచేసుకోవడానికి అవకాశం ఉండదని తెలిపారు. యూడైస్‌లో ఉన్న విధంగా సరైన సమాచారం నింపని పాఠశాలల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు.ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.